క్లుప్తంగా

అధ్యాపకురాలికి సన్మానం



అధ్యాపకురాలిని సన్మానిస్తున్న సహచర అధ్యాపకులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం బోధించే అధ్యాపకురాలు జయమణిని ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఇంటర్ మీడియట్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేసింది. దీంతో మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ మంగరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. రూ.7వేల విలువ గల బహుమతులు అందించారు. ఆమె కళాశాలలో విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుంకర రమేశ్, సైదులు, పర్వతాలు, రామిరెడ్డి, రామారావు, శ్రీనివాస్, రాధ, ప్రవీణ, యాదయ్య, పెద్దయ్య, రాఘవులు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



మల్లయ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

కడ్తాల్: ప్రతి ఉద్యోగి జీవితంలో విరమణ సాధారణమని ఎంపీడీఓ సుజాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వర్తించిన మల్లయ్యకు మంగళవారం రిటైర్మెంట్ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు, అధికారులు హాజరై మల్లయ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

బాధ్యతల స్వీకరణ



ఎన్.జగదీశ్వర్‌రెడ్డి, ఆర్డీఓ, కందుకూరు

కందుకూరు: కందుకూరు ఆర్డీఓగా ఎన్. జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నర్సాపూర్ ఆర్డీఓగా పని చేసిన ఆయనను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్లాట్ల కబ్జాపై పోలీసులకు ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: తమ ప్లాట్లను కబ్జా చేశారంటూ మీర్‌పేట్‌కు చెందిన మర్రి రాజారెడ్డి, మామిడి అమృత్‌రెడ్డి, పులిపాటి మణికంఠం మంగళవారం ఆదిబట్ల పోలీసులను ఆశ్రయించారు. మున్సిపల్ పరిధిలోని సర్వే నంబరు 23 నుంచి 31 వరకు ఉన్న చక్రధర వెంచర్‌లో తమకు 1,500 గజాల స్థలం ఉందని తెలిపారు. దీన్ని కొంతమంది ఆక్రమించారని, న్యాయం చేయాలని విన్నవించారు.

ప్రజానిరసన సదస్సుకు తరలిన బీఆర్‌ఎస్



వనపర్తి సదస్సులో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

ఆమనగల్లు: వనపర్తిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతాంగ ప్రజా నిరసన సదస్సుకు ఆమనగల్లు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. వీరిలో బీఆర్‌ఎస్ నాయకులు వడ్డె వెంకటేశ్, రమేశ్‌నాయక్, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్డీఓకు సన్మానం



కందుకూరులో ఆర్డీఓను సన్మానిస్తున్న తహసీల్దార్ నాగార్జున

తలకొండపల్లి: స్థానిక తహసీల్దార్ నాగార్జున మంగళవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

మాడ్గుల: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాడ్గుల సీఐ జగదీష్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పడమటి తండా నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఓ టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ ఎవరైనా అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మత్తు.. యువత చిత్తు!

- విచ్చలవిడిగా మాదకద్రవ్యాల వినియోగం
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం



దాసర్లపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గంజాయి, మద్యం సేవించిన ఆనవాళ్లు

కందుకూరు: మత్తుకు బానిసలుగా మారుతున్న కొందమంది యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా గంజాయి వంటి మాదక ద్రవ్యాలను సేవిస్తున్నారు. ఇది వారి భవిష్యత్తుతో పాటు కుటుంబంపై భారం పెరిగి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. వారిని మత్తు నుంచి దూరం చేయడానికి పోషకులు అనేక తిప్పలు పడాల్సిన దుస్థితి నెలకొంటోంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది మండల పరిధిలోని పరిస్థితి.

చాటుమాటుగా..

మండలంలోని చాలా గ్రామాల్లోని ఎంతో మంది యువత మాదక ద్రవ్యాలకు బానిసగా మారారు. మారుమూల ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు, చెరువు గట్ల వెంబడి పొదల్లో, వెంచర్లలో కూర్చుని గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తున్నారు. ఇటీవల కొత్తగూడ పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో ఓ వృద్ధ జంటను హత్య చేసిన విషయం తెలిసిందే. దాసర్లపల్లికి చెందిన ఓ యువకుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలు తీసుకుని, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని విచారణలో తేలింది. గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న వారిని పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావనే డిమాండ్లు ఊపందుకున్నాయి.

వలస వ్యక్తులతో సమస్యలు

యువతతో పాటు మండల కేంద్రంలో బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూలీ పనులకు వచ్చిన చాలా మంది గుట్కాలతో పాటు మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డారు. ఇటీవల ఆ మత్తులో మూకుమ్మడిగా ఒకరిపై ఒకరు దాడులు సైతం చేసుకుంటుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక్కో గదిలో పదుల సంఖ్యలో నివసిస్తూ తరచూ గొడవలకు దిగుతుండటంతో ఇరుగు పొరుగుకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయమై స్థానికులు వారిపై చర్యలు తీసుకునేలా పీఎస్‌లో ఫిర్యాదు చేయడానికి సంతకాల సేకరణ సైతం చేపట్టారు. యువత పాడవకుండా గంజాయి వంటి మాదక ద్రవ్యాలు లభించకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలి



హుడాకాలనీ బస్తీ కమిటీ లోగోను ఆవిష్కరిస్తున్న భీమేశ్ తదితరులు

మీర్‌పేట: బస్తీవాసులందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని పీవైఎల్ (ప్రోగ్రెసివ్ యూత్ లీగ్) బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం మీర్‌పేట లెనిన్‌నగర్ హుడాకాలనీ నూతన బస్తీ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గడియాముల కృష్ణ, షాగంటి పుల్లయ్య, అధ్యక్షుడిగా గంధమల్ల మహేశ్, ఉపాధ్యక్షుడిగా వంగారి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎర్రగోటి ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా కొల్లూర్ శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మట్ట నర్సింగ్‌రావు, కోశాధికారిగా గడ్డమీది శంకర్, సహాయ కోశాధికారిగా రాకేశ్, సలహాదారులుగా ఆకుల బాబురావు, కొల్లూర్ భీమేశ్, ఎస్.కే.షాహిద్, షాగంటి నవీన్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భీమేశ్ హుడాకాలనీ బస్తీ కమిటీ లెటర్‌ప్యాడ్ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. కాలనీ అభివృద్ధికి యువత, పెద్దలు అంతా కలసికట్టుగా ఉండాలని, కాలనీల మాదిరిగా ప్రతి వీధికి బస్తీపేరు, రోడ్ నెంబర్ సూచించేలా బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

క్యూబాపై నిర్బంధాన్ని ఎత్తివేయాలి



ఆమనగల్లులో సీఐటీయూ నాయకుల ర్యాలీ



ఇబ్రహీంపట్నంలో క్యూబాకు మద్దతుగా ర్యాలీ

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- అమెరికా తీరును నిరసిస్తూ ర్యాలీలు

ఇబ్రహీంపట్నం: క్యూబాపై అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య, నిర్బంధానికి ముగింపు పలకాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు సుధాకర్, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అమెరికాకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమెరికా విధించిన ఆంక్షలతో క్యూబా ఆర్థికంగా నష్టపోయిందన్నారు. ఈ నిబంధనలతో అక్కడ వ్యవసాయ రంగం దెబ్బతిన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. క్యూబాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాండు, నర్సింహ్మ, ఎల్లేష్, బాలమణి, సావిత్రి, చంద్రయ్య, మల్లమ్మ, జగన్, దాసు, నరుష్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో ఆందోళన..

ఆమనగల్లు: క్యూబాపై అమెరికా విధించిన నిర్బంధాన్ని వెంటనే ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైద్రాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్‌చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. అమెరికా విధించిన వాణిజ్య, ఆర్థిక నిర్బంధాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, కేవీపీఎస్ జిల్లా నాయకులు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నక్కర్తమేడిపల్లిలో విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న సీఐలు కృష్ణంరాజు, జోసఫ్

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందేందుకు ఆర్థిక సాయం అందించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎల్బీనగర్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రం, షీం టీంల ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జీవన్‌రెడ్డి సహకారంతో ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రం సీఐ జోసఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పార్టీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

కందుకూరు: బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని దెబ్బడగూడలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనతో భారతదేశ కీర్తి మరింత ఇనుమడించిందన్నారు. దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. అందరూ పార్టీ మరింత బలపడేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జిట్టా రాజేందర్‌రెడ్డి, కళ్లెం సుధాకర్ రెడ్డి, సురసాని భూమిరెడ్డి, డేరంగుల శ్రీరాములు, ఎల్మటి అశోక్‌రెడ్డి, సామల దయాకర్‌రెడ్డి, కళ్లెం వేణుగోపాల్‌రెడ్డి, బండ నర్సింహా, మోటె జంగయ్య, బండ భిక్షపతి, బడక శ్రీనివాస్, కళ్లెం సందీప్‌రెడ్డి, డేరంగుల రామకృష్ణ, నీలం భిక్షపతి, కర్రె అరవింద్, డేరంగుల గణేశ్, చెంచు అనిల్, శ్రీను పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ సామాజిక బాధ్యత

తలకొండపల్లి: ప్రజలకు సకాలంలో నిత్యావసర సరకులు అందించాల్సిన బాధ్యత రేషన్ డీలర్లపైనే ఉందని తహసీల్దార్ నాగార్జున అన్నారు. సరుకుల పంపిణీని సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని సూచించారు. అనంతరం రేషన్ డీలర్లు తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు



వెంకట్రామ్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఉద్యోగికి బదిలీ తప్పదు

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: ప్రతీ ఉద్యోగికి తన ఉద్యోగ కాలంలో బదిలీ తప్పదని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించి, జల్‌పల్లి మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లిన కమిషనర్ బి.వెంకట్రామ్‌కు మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కమిషనర్ చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఆయన బదిలీ కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, మేనేజర్ పర్వతాలు, ఏఈ గుణాకర్, సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశం, మల్లేశ్, జంగయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట కోతకొచ్చింది

- చేతికొస్తున్న ఖరీఫ్ వరి
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సర్వం సిద్ధం
- దళారులకు విక్రయించొద్దని అధికారుల సూచన



నస్దిక్‌సింగారం-చింతుల్ల గ్రామాల మధ్య వరి కోతను కోస్తున్న యంత్రం

యాచారం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వరి సాగు అధికంగా నమోదైంది. ఈ ఏడాది జూలై చివరి వరకు వర్షాల్లేక నార్లు పోసిన రైతులు ఆందోళన చెందారు. ఆతర్వాత విరివిగా వానలు కురువడం, బోరుబావుల్లో భూగర్భజలాలు పెరగడంతో రైతులకు భరోసా కలిగింది. ఈక్రమంలో యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్ తదితర మండలాల్లో 23,750 ఎకరాల్లో వరి పంట సాగైంది. అత్యధికంగా మంచాల మండలంలోని లోయపల్లి, బోడకొండ, ఎల్లమ్మతండా, ఆరుట్ల, మంచాల, రంగాపూర్, యాచారం మండలంలోని నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, మాల్, కిషన్‌పల్లి, మంతన్‌గౌరెల్లి, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండుమైలారం, రాయపోల్, ముకునూర్ తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేశారు. నీటి వనురులను బట్టి ముందే నాటేసిన వరి పంట ప్రస్తుతం కోతలకు రాగా, ఆలస్యంగా నాటేసిన వరి పంట మరో పక్షం రోజుల్లో కోతలకు వచ్చే అవకాశం ఉంది.

ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లకుండా..

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లకుండా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఏ గ్రేడ్‌కు రూ.2,320, కామన్ గ్రేడ్‌కు రూ.2,300 ధర నిర్ణయించారు. సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనున్నారు. డివిజన్‌లోని పలు మండలాల్లో 15 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు వ్యవసాయ శాఖ నిర్ణయించింది. గతంలో గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని సుదూరంలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపేవారు కాదు. దళారులే వ్యవసాయ పొలాల వద్దకు వచ్చి.. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా క్వింటాలుకు రూ.500 తగ్గించి ఇచ్చేవారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. కానీ ప్రస్తుతం అలా జరగకుండా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. రెండు, మూడు రోజుల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం సేకరిస్తారు.

కోత ఖర్చుతో రైతుల్లో దడ

వరి కోత ఖర్చులు తడిసిమోపెడవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం పత్తి తీత పనులు కూడా జోరుగా సాగుతున్న నేపథ్యంలో కూలీలకు భలే డిమాండ్ ఏర్పడింది. దీంతో రైతులు యంత్రాలతో వరి పంటను కోయిస్తున్నారు. గతేడాది గంటకు రూ.2 వేలు తీసుకోగా.. ప్రస్తుతం రూ.2,500 నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు

బాచారం, కొహెడ, బండరావిరాల, పొల్కంపల్లి, ఆర్‌కే మైలారం, ఇబ్రహీంపట్నం, మంగల్‌పల్లి పటేల్‌గూడ, రాయపోల్, బోడకొండ, మంచాల, యాచారం, నందివనపర్తి (2), చింతపట్ల, మంతన్‌గౌరెల్లిలో ధాన్యం కొనుగోలుకు సెంటర్లు ఏర్పాట్లు చేశారు.



దాన్యాం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సుజాత

ఎకరాకు రూ.25 వేల ఖర్చు



కూలీలతో మూడెకరాల వరి కోయించా. రూ.30 వేలు అడగగా.. రూ. 25 వేలు ఇస్తానని చెప్పా. డబ్బులు కాక పోతే ఎకరా పొలం కోస్తే రూ.12 క్వింటాళ్ల ధాన్యం అడుగుతున్నారు. పెట్టుబడులు, కూలీల ఖర్చులు పోతే ఏమీ మిగులడం లేదు.

– కలకొండ బీరప్ప, రైతు నక్కర్తమేడిపల్లి

మోసపోవద్దు



త్వరలోనే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. దళారులకు ధాన్యం విక్రయించి ధర, తూకంలో మోసపోవద్దు. నింబంధనల ప్రకారం ధాన్యం తేస్తే వారం రోజుల్లో డబ్బులు జమ చేస్తాం.

– కాయితి సుజాత, ఏడీఏ ఇబ్రహీంపట్నం

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

బడంగ్‌పేట్: ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని స్థానిక నాయకులు మంగళవారం బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కందికంటి నవీన్‌గౌడ్, ప్రకాశ్‌రెడ్డి, బి.ప్రదీప్‌రెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు. అనంతరం గ్రూప్–2కు సిద్ధం అవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు చైర్మన్‌ను కలిసి తమ గోడును వెలుబుచ్చారు. లైబ్రరీలో ప్రిపేర్ అవుతున్న మాకు రాత్రి సమయంలో భోజనం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన ఆయన గ్రూప్–2కు ప్రిపేర్ అవుతున్న 120 మందికిపైగా విద్యార్థులకు రాత్రి భోజనం నేటి నుంచే ఉచితంగా ఏర్పాటు చేస్తానని విద్యార్థులకు తెలిపారు. అలాగే పది గంటల వరకు తెరిచి ఉంచుతున్న లైబ్రరీ టైంను ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు కోసం మరో రెండు గంటలు అదనంగా 12 గంటల వరకు అందుబాటులో ఉండేలా చేస్తున్నామని విద్యార్థులకు తెలిపారు. సెక్యూరిటీ కూడా ఉండేలా మాట్లాడుతానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిరుద్యోగులు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి పూర్తయిన విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారందరూ ఒకచోట కలుసుకొని ఒకరికొకరూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మండల పరిషత్‌లకు నిధులివ్వాలి

యాచారం: రేవంత్‌రెడ్డి సర్కార్ గ్రామాలాభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేయాలని యాచారం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు దెంది రాంరెడ్డి కోరారు. మండల పరిధిలోని తమ్మలోనిగూడలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు. మండల పరిషత్‌లకు ప్రత్యేక నిధులు లేకపోవడంతో గ్రామాల్లో ఎంపీటీసీలు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ గ్రామాలతో పాటు మండల పరిషత్‌లకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే బాగుంటుందని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రాంరెడ్డి